

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ దశరథ్‌నాయక్

# కుటిల రాజకీయాలు మానుకోవాలి

**విద్యార్థుల భవిష్యత్ కోసం రాజీనామాకు సిద్ధం**
**ఎంపీ మల్లురవితో కేజీబీవీ పాఠశాలని ప్రారంభించాలి**
**జడ్పీటీసీ దశరథ్‌నాయక్**

కడ్తాల్, జూన్ 23: విద్యా సంవత్సరం ప్రారంభమై పదిహేను రోజులు గడుస్తున్నా కస్తూర్బా విద్యాలయానికి సంబంధించిన నూతన భవవాన్ని ఎందుకు ప్రారంభించడంలేదని, భవనం ప్రారంభానికి తన పదవే అడ్డంకి అయితే రాజీనామా చేయడానికి సిద్ధమని జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలో కేజీబీవీ విద్యాలయం కొన్ని ఏండ్లుగా అద్దె భవనంలో కొనసాగుతుందని, భవనంలో సరిపడా వసతులు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేజీబీవీ భవనం నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కోట్ల రూపాయలు మంజూరు చేసిందని, ఎన్నో ఆటంకాల మధ్య పాఠశాల నిర్మాణ పనులు పూర్తి చేయించడం జరిగిందని పేర్కొన్నారు. భవన నిర్మాణ పనులు పూర్తయినా కేజీబీవీని ఎందుకు ప్రారంభించడంలేదని ప్రశ్నించారు. కుటిల రాజకీయాలతో కొంత మంది కాంగ్రెస్ నాయకులు పాఠశాల భవనం ప్రారంభించడానికి ఆలస్యం చేస్తున్నారని, అధికారులు ఎవరికి భయపడి అలసత్వం ప్రదర్శిస్తున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే స్థాయిలో ఉండి మంత్రి సమయం ఇవ్వడంలేదంటూ, పాఠశాలను ప్రారంభించడానికి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. మూడు సార్లు ఎంపీగా గెలుపొందిన నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి కేజీబీవీని ప్రారంభించాలని పేర్కొన్నారు. శిలాఫలకంపై తన పేరు వస్తుందనే అక్కసుతో కొంతమంది కాంగ్రెస్ నాయకులు భవనం ప్రారంభించడంలో ఆలస్యం చేస్తున్నారని విమర్శించారు. ఒకవేళ కేజీబీవీ ప్రారంభానికి తన పదవి అడ్డొస్తే, ప్రొటోకాల్ ప్రకారం ప్రజలిచ్చిన జడ్పీటీసీ పదవికి రాజీనామా చేయడానికి సిద్ధమని ఆయన ప్రకటించారు. పాఠశాల ఇంకా ప్రారంభంకాలేదని, విద్యార్థులకు సీట్లు లేవని కుంటి సాకులు చెప్పి ఆమనగల్లు, కందుకూరు మండలాలకు చెందిన విద్యార్థులను బయటికి పంపించడం పద్ధతి కాదని అధికారులకు సూచించారు. వెంటనే పాఠశాలను ప్రారంభించకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఆనంద్, రైతు కమిటీ కోఆర్డినేటర్ వీరయ్య, ఎంపీటీసీ గోపాల్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు సేవ్యానాయక్, వెంకటయ్యయాదవ్, మాజీ సర్పంచ్‌లు తులసీరాం నాయక్, హరిచంద్‌నాయక్, నర్సింహాగౌడ్, భూనాథ్‌నాయక్, జంగయ్యగౌడ్, సాయిలు, నాయకులు రామచంద్రయ్య, వినోద్, పాండూనాయక్, శ్రీనివాస్, గోపాల్, అంజి, కృష్ణ, శ్రీకాంత్, గణేశ్, మహేశ్ పాల్గొన్నారు.

# జాగ్రత్తలతోనే జీవాల సంరక్షణ

**వర్షాకాలంలో ముందస్తు చర్యలు తప్పనిసరి అంటున్న వైద్యులు**
**తగిన సలహాలు, సూచనలు పాటించాలి**
**పశువైద్యాధికారి సురేశ్‌బాబు**



ఇబ్రహీంపట్నంరూరల్, జూన్ 23 : గొర్రెలను సంరక్షించుకోవడం కోసం, గొర్రెకాపరుల్లో సరైన అవగాహన లేక మందలు వృద్ధి చెందడం లేదు. ముఖ్యంగా గొర్రెల పోషణ సరిగ్గాలేక సీజనల్‌లో వచ్చే వ్యాధులపై సరైన జాగ్రత్తలు పాటించకపోవడంతో గొర్రెలు మృత్యువాతకు గురవుతున్నాయి. గొర్రెకాపరులు సరైన జాగ్రత్తలు పాటించాలని, పశుసంర్ధకశాఖ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు అందజేస్తున్న వ్యాధి నివారణ మందులతో పాటు పలు రకాలకు సంబంధించిన వ్యాధులను అరికట్టేందుకు వేస్తున్న నివారణ మందులను సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలం ఆరంభంలో సీజనల్‌గా వచ్చే వ్యాధులు, వాటి నివారణ చర్యలపై తప్పనిసరిగా పెంపకందారులు అవగాహన కలిగి ఉండాలి. పౌష్టికాహారమైన మేతపైనే జీవాల ఆరోగ్యం, ఉత్పాదక సామర్థ్యం ఆధారపడి ఉంటుందన్నారు. గొర్రెలు శుభ్రమైన నీరు తాగేలా చూసుకోవాలి.

**గొర్రెలకు సోకే వ్యాధులు.. పాటించాల్సిన జాగ్రత్తలు..**

గొర్రెల ఆరోగ్య విషయంలో తగు శ్రద్ధ తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ అధికారులు సూచిస్తున్నారు. గొర్రెలకు ప్రభుత్వపరంగా నట్టల నివారణ మందులు పంపిణీ చేయడంతో పాటు నాలుగు రోజులకు పీపీఆర్ టీకాలు వేస్తున్నప్పటికీ ఇతర అంటువ్యాధులు ప్రబలి చనిపోయే అవకాశాలున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి కుంటుతుంటాయి. ఈగలు, దోమల బెడదవల్ల మూతి పుండ్లు, బ్లూటింగ్ వ్యాధులు సోకుతాయి. నోటి భాగమంతా వాచి మేత తినకుండా జీవాలు నీరసపడి మరణిస్తాయి. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పశుసంవదర్ధకశాఖ అధికారులు సూచనలిచ్చారు.

- దోమలు, ఈగల నివారణకు మంద దగ్గర వేపాకు లేదా, ఊక(వరిపొట్టు)తో పొగపెట్టాలి.
- చిత్తడి నేలల్లో గొర్రెల్ని తిరగనీయకూడదు. కలుషితమైన వరదనీరు తాగకుండా చూసుకోవాలి.
- మూతిపుండ్లు, కాలిపుండ్లకు పొటాషియం పర్మాంగనేట్ నీటితో కలిగి, ఆయింట్‌మెంట్ రాయాలి.
- వ్యాధులు సోకడం కంటే ఆ వ్యాధులవల్ల కలిగే నీరసంతోనే జీవాలు ఎక్కువగా మరణిస్తాయి. బెల్లం జావ తాగిస్తే నీరసపడవు.
- పాకలో వారానికోసారి పొడి సున్నం, ఫినాయిల్ గానీ చల్లాలి.
- నీరసంగా ఉన్న గొర్రెల్ని మందతో తీసుకెళ్లకుండా ఇంటి వద్దే ఉంచి మేత ఇవ్వాలి.
- కొత్తగా కొనుగోలు చేసిన గొర్రెల్ని మందతో 10నుంచి 15రోజులు వరకూ కలపకూడదు.

**అధికారుల సలహాలు పాటించాలి**



గొర్రెల పెంపకందారులు, పశుసంవర్ధకశాఖ అధికారులు అందించే సలహాలు సూచనలు పాటించి మందలను వృద్ధి చేసుకోవాలి. ఏయే సీజన్‌లో ఏ వ్యాధులు సోకుతాయో వాటి కంటే ముందు జాగ్రత్తగా టీకాలు వేయించాలి. పశువైద్యాధికారుల సలహాలు పాటిస్తే గొర్రెలను సంరక్షించుకోవచ్చు.
**- సురేశ్‌బాబు, పశువైద్యాధికారి**

## 26న క్రీడా పోటీల నిర్వహణ

షాద్‌నగర్‌టౌన్, జూన్ 23 : తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలలకు విద్యార్థుల ఎంపికలో భాగంగా షాద్‌నగర్ పట్టణంలోని మినీ స్టేడియంలో బుధవారం 10గంటలకు మండల స్థాయి విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు ఎంఈవో శంకర్‌రాథోడ్, ప్రభుత్వ పాఠశాల పీడీ రాజశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, కేజీబీవీ, మాడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్ విద్యార్థులు అర్హులన్నారు. క్రీడా పాఠశాలలో నాలుగో తరగతి కోసం 8నుంచి 9సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలన్నారు. క్రీడా పోటీలకు బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ, పాఠశాల బోనోఫైడ్, ఐదు పాస్ పోర్ట్‌సైట్ ఫొటోలు తీసుకురావాలన్నారు. విద్యార్థులకు వివిధ క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వెంటనే రుణమాఫీ చేయాలి

ఆమనగల్లు, జూన్ 23: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయకుండానే సంబురాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు దోనాదుల కుమార్ ఎద్దేవా చేశారు. ఆమనగల్లు మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత రుణ మాఫీ చేయకుండా రైతులను మోసం చేస్తుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ వెంటనే ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఆర్థిక సాయం అందజేత



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, జూన్ 23: మండల పరిధిలోని గౌరారం గ్రామానికి చెందిన దివ్యాంగుడు నిట్ట పర్వతాలుకు చెందిన రెండు పాడి ఆవులు పిడుగుపాటుకు ఇటీవల మృతి చెందాయి. విషయం తెలుసుకున్న ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.25వేలు చెక్‌ను అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు రాములు, కాంగ్రెస్ నాయకులు శ్రీరాములు, రాజశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రాఘవేందర్, మల్లేశ్, అభినవ్, కొండల్‌రెడ్డి, ఆశ్రఫ్, సాజిద్, రామస్వామి, రమేశ్, కిరణ్, కుమార్, వెంకటయ్య, వినోద్ ఉన్నారు.

**అబ్దుల్లాపూర్‌మెట్‌లో..**

అబ్దుల్లాపూర్‌మెట్ : మండల కేంద్రంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఒంటరిగా జీవిస్తున్న సోమిశెట్టి చంద్రశేఖర్(68) చాలా కాలం క్రితం తన భార్య మరణించగా, ఒంటరిగా ఉంటూ పొట్టకూటి కోసం ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద కర్చీఫ్‌లు, పెన్నులు అమ్ముకుంటూ జీవనం సాగించే వాడు. ఆదివారం ఉదయం గుండె పోటుతో మరణించాడు. ఆయనది నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న సురక్షా సేవా సంఘం గ్రూపు సభ్యుల నుంచి విరాళాలు సేకరించి చంద్రశేఖర్ అంతిమ సంస్కారాల కోసం రూ.7వేల నగదు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గోపిశంకర్‌యాదవ్, సలహాదారులు నాగవల్లి యాదగిరి, సభ్యులు చెంగన్న, వెంకటేశ్, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

## కందుకూరు సీఐగా సీతారామ్



మగ్బూల్ జానీ నుంచి సీఐగా బాధ్యతలు తీసుకుంటున్న సీతారామ్

కందుకూరు, జూన్ 23 : కందుకూరు పోలీస్‌స్టేషన్ సీఐగా సీతారామ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన మగ్బూల్ జానీని సైబరాబాద్ సీపీ జోషి సైబర్‌క్రైమ్‌కు బదిలీ చేయడంతో ఆయన స్థానంలో చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐగా పని చేస్తున్న సీతారామ్‌ను కందుకూరు పోలీస్‌స్టేషన్‌కు సీఐగా బదిలీచేశారు. మగ్బూల్ జానీ నుంచి సీతారామ్ బాధ్యతలు తీసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా చూస్తానన్నారు.

## ఘనంగా బొడ్రాయి వేడుకలు

**బోనాలు సమర్పించిన మహిళలు**



కుమ్మరిగూడలో జరిగిన బోనాల ఊరేగింపులో పాల్గొన్న జనం

షాబాద్, జూన్ 23: షాబాద్ మండలంలోని కుమ్మరిగూడలో బొడ్రాయి బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం గ్రామంలో బొడ్రాయి విగ్రహం వద్ద పూజలు చేశారు. అనంతరం మహిళలు బోనాలతో గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి బోనాలు సమర్పించారు. ఈ ఉత్సవాల్లో శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో మాజీ సర్పంచ్ పోనమోని కేతన రమేశ్‌యాదవ్, ఎంపీటీసీ దేశమళ్ల అరుణ, మాజీ ఎంపీటీసీ పోచయ్య, గ్రామ పెద్దలు రమేశ్‌యాదవ్, మంచాని నారాయణరెడ్డి, దేశమళ్ల ఆంజనేయులు, క్యామ నారాయణ, కుమార్‌యాదవ్, హనుమంతు, మల్లయ్య, శ్రీశైలం, యువకులు తదితరులున్నారు.

## తండాల అభివృద్ధికి నిధుల మంజూరు



రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి నుంచి ప్రొసీడింగ్‌ను తీసుకుంటున్న జడ్పీటీసీ నేనావత్ అనురాధ

ఆమనగల్లు, జూన్ 23: మండల పరిధిలోని తండాల అభివృద్ధికి రూ.16 లక్షలు మంజూరైనట్లు మండల జడ్పీటీసీ నేనావత్ అనురాధ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి దీనికి సంబంధించిన ప్రొసీడింగ్‌ను అందజేసినట్లు జడ్పీటీసీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని పులిగోనిపల్లి తండా, సీతారాంనగర్ తండా పంచాయతీ సీసీ రోడ్డుకు రూ.5లక్షలు, మేడిగడ్డ తండా సీసీ రోడ్డుకు రూ.5లక్షలు, రాంనూంతల పెద్ద తండా సీసీ రోడ్డుకు రూ. 4లక్షలు, కేశ్యాతండా, శంకర్‌కొండా తండాలకు మట్టిరోడ్డుకు రూ. 2లక్షలు మంజూరైనట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్ ఉన్నారు.

## కుక్కల దాడిలో మూగజీవాలు మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రె

షాద్‌నగర్‌రూరల్, జూన్23 : ఫరూఖ్‌నగర్ మండలంలోని కాశీరెడ్డిగూడ గ్రామంలో కుక్కల దాడిలో మూగజీవాలు మృతి చెందిన ఘటన ఆదివారం తెల్లవారుజామున జరిగింది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన తోట శ్రీశైలం గొర్రెలు, మేకలు మేపుతూ జీవనం కొనసాగించేవారు. దినచర్యలో భాగంగా గొర్రెలు, మేకలను శనివారం రాత్రి తన పొలంలో విడిచి వెళ్లాడు. ఉదయం వచ్చి చూడగా ఈ మందపై కుక్కలు దాడి చేసి పది గొర్రెలు, రెండు మేకలు మృతి చెందాయి. చనిపోయిన మూగజీవాలకు పశువైద్యాధికారి శ్రీధర్‌కుమార్ పోస్ట్‌మార్టం చేశారు. వీధికుక్కల బెడదతో భయాందోళనకు గురవుతున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యాచారం, జూన్ 23 : విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా నేడు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సందీప్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని తక్కళ్లపల్లి, నందివనపర్తి 11కేవీ ఫీడర్ల పరిధిలో నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీంతో తక్కళ్లపల్లి గ్రామంతో పాటుగా నందివనపర్తి, బొల్లిగుట్టతండా గ్రామాల్లోని వ్యవసాయానికి ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఆయన చెప్పారు. రైతులు, వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

## రేపు ఉచిత వైద్య శిబిరం

పెద్దఅంబర్‌పేట : లక్ష్మారెడ్డి పాలెంలోని వర్డ్ అండ్ డీడ్ క్యాంపస్‌లోని యూనికార్ప్స్ హాస్పిటల్‌లో యూనికార్ప్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఈ శిబిరంలో సాధారణ పరీక్షలతోపాటు బీపీ, షుగర్, రక్త, దంత, కంటి పరీక్షలు చేస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు.

## కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



హైతాబాద్‌లో ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

షాబాద్, జూన్ 23: కార్మికుల ప్రయోజనమే ఏఐటీయూసీ కర్తవ్యమమని, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించాలని సీపీఐ రంగారెడ్డిజిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. ఆదివారం షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ పారిశ్రామిక వాడలో ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ నూతన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షాబాద్ మండలంలో చాలా విస్తృతమైన పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయని, ఇతర ప్రాంతాల నుంచి వేలాదిగా కార్మికుల ఉద్యోగాల కోసం వస్తున్నారని, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామస్వామి, జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, సీపీఐ మండల కార్యదర్శి జంగయ్య, నాయకులు రఘురామ్, మధు, మంజుల, రాములు, జహంగీర్ పాల్గొన్నారు.

## అపూర్వం ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వపు విద్యార్థులు

షాబాద్, జూన్ 23: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1994–95లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా కలుసుకున్నారు. ఆదివారం షాబాద్‌లోని ఓ గార్డెన్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 30 ఏండ్ల తర్వాత కలుసుకొని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు వీరస్వామిగౌడ్, ప్రసాద్‌రావు, లింగం, యాదగిరిచారి, జనార్దన్, పూర్వ విద్యార్థులు రవీందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ప్రవీణ్, గౌరీశంకర్, యాదగిరి, శ్రీనివాస్, సుదర్శన్‌గౌడ్, గోపాల్, శ్రీశైలం పాల్గొన్నారు.

## 28న ఇండోర్ స్టేడియంలో సహజ యోగా, ధ్యానం




యోగా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గౌరీకృష్ణ, తదితరులు

ఆర్కేపురం, జూన్ 23 : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సహజ యోగా రాష్ట్ర కోఆర్డినేటర్ గౌరీకృష్ణ అన్నారు. ఈనెల 28న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం లో నిర్వహించనున్న సహజ యోగా, ధ్యానం పోస్టర్‌ను ఆదివారం ఇండోర్ స్టేడియంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌరీకృష్ణ మాట్లాడుతూ మాతాజీ నిర్మలాదేవి స్థాపించిన సహజయోగ నేడు సుమారు 170 దేశాల్లో వ్యాప్తి చెందిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది సహజ యోగా సాధన చేస్తూ శారీరక, మానసిక భావోద్వేగ సమస్యలను పరిష్కరించుకుంటూ ఆధ్యాత్మి సంతృప్తిని పొందుతున్నారని తెలిపారు. జూన్ 26 నుంచి 30 వరకు సుమారు 500 మంది ప్రతినిధులు దేశంలో పర్యటిస్తారని పేర్కొన్నారు. ప్రజ లంతా సహజ యోగలో పాల్గొన్నాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ కోఆర్డినేటర్ మల్లారెడ్డి, రామ్మోహన్‌రావు, సుబ్బిరెడ్డి, కమిటీ సభ్యులు సుప్రజ, సునీల్ అగర్వాల్, తదితరులు పాల్గొన్నారు.

## గచ్చిబౌలి స్టేడియంలో జాతీయ ఒలింపిక్ దినోత్సవం




గచ్చిబౌలి స్టేడియంలోని హాకీ క్రీడాప్రాంగణంలో జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాకీ తెలంగాణ అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్ హాజరై ఒలింపిక్ రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొద్దిరోజుల్లో పారిస్‌లో నిర్వహించే ఒలింపిక్ క్రీడల్లో హాకీతో పాటు ఇతర క్రీడల్లో తెలంగాణ క్రీడాకారులు రాణించాలన్నారు. కార్యక్రమంలో హాకీ తెలంగాణ సెక్రటరీ భీంసింగ్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల హాకీ సెక్రటరీ వేణుభాస్కర్‌రెడ్డి, కోచ్‌లు సోనీ, జ్యోతిలతోపాటు పలువురు హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు.

*– శేరిలింగంపల్లి, జూన్ 23*

## శ్యామప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

యాచారం, జూన్23: మండల కేంద్రంలో శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ (పుణ్య అతిథి) కార్యక్రమాన్ని బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ మాట్లాడుతూ.. నెహ్రూ ప్రభుత్వంలో ముఖర్జీ పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేసి పేదల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆయన స్థాపించిన జనసంఘ్ పార్టీ అంచెలంచెలుగా ఎదిగి కాలక్రమేనా నేడు భారతీయ జనతా పార్టీగా ఎదిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్యగౌడ్, గోగికార్ రమేశ్, సత్తయ్య, విజయ్‌బీరప్ప, నరేందర్, ఐలేశ్, కృష్ణ, రాజు తదితరులున్నారు.

**ముఖర్జీ ఆశయ సాధనకు కృషి చేయాలి**

చేవెళ్లటౌన్ : భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు, కేంద్ర మాజీ మంత్రి వర్యులు దివంగత శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు కృషి చేయాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అతెల్లి అనంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన వర్ధంతి సందర్భంగా చేవెళ్ల మండల కేంద్రంలో ముఖర్జీ చిత్రపటానికి పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకట్ రామ్‌రెడ్డి, నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్, మచ్చేందర్‌రెడ్డి, చాకలి శ్రీనివాస్, అభిషేక్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గణేశ్, నవీన్‌రెడ్డి, దామోదర్, వెంకట్, జయసింహారెడ్డి, కృష్ణమోహన్, వెంకటేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమ్మ ఆదర్శ పాఠశాలలు ఆగమాగం!

- **అల్మాస్‌గూడ పాఠశాల పాత గోడలకు పైపూతలు**
- **పెచ్చులు ఊడుతున్నా వాటిపై కలర్ వేస్తున్న వైనం**
- **కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం.. పట్టించుకోని అధికారులు**



అల్మాస్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పెచ్చులు ఊడిపోతున్నా రంగు వేసిన దృశ్యం

బడంగ్‌పేట, జూన్ 23 : అమ్మ ఆదర్శ పాఠశాలలు ఆగమాగంగా తయారయ్యాయి. పాఠశాలల్లో మైనర్ మరమ్మతులను తూతూ మంత్రంగా చేస్తున్నారు. నాణ్యత లేకుండా పనులు చేపడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మహేశ్వరం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలల కింద మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. అయితే ఎక్కడా కూడా మరమ్మతులను సక్రమంగా చేయడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అమ్మ ఆదర్శ పాఠశాల కింద నిధులు కేటాయించడంతో బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి అల్మాస్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఆదివారం కాంట్రాక్టర్ కలర్ వేయించారు. మున్సిపల్ కార్పొరేషన్ నుంచి కొంతమేరకు మరమ్మతులు చేపట్టారు. అయితే సదరు కాంట్రాక్టర్ మాత్రం పాత గోడలకు పైపూత పూస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఓ పక్క స్కూల్ భవనానికి కలర్ వేస్తుంటే మరో పక్క పెచ్చులు ఊడిపోతున్నా యి. అయినా పెచ్చుల పైనుంచి కలర్ వేస్తుండటంపై స్థానికులు మండిపడుతున్నారు. కిటికీలు ఊడిపోతున్నా, వాటి పైనుంచి కలర్ వేస్తున్నారు. కాంట్రాక్టర్ హడావిడిగా కలర్ వేయించినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడం వల్లనే కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పాఠశాలలో పనులు చేస్తున్నప్పుడు ప్రధానోపాధ్యాయులు దగ్గరుండి చూసుకోవాలన్న ఆలోచనను మర్చిపోయారు. దాంతో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు ఆగం చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఇకనైనా అధికారులు దృష్టిసారించి పనులను నాణ్యతతో చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## అలరించిన కూచిపూడి, భరతనాట్య నృత్య ప్రదర్శనలు



కొండాపూర్, జూన్ 23: వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురు కళాకారులు కూచిపూడి, భరతనాట్య నృత్య ప్రదర్శనలతో అలరించారు. ఇందులో భాగంగా ఆదివారం కువైట్‌లో పుట్టి, పెరిగినప్పటికీ హిందూ సంస్కృతీసంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ, సంప్రదాయ నృత్యమైన కూచిపూడిని ప్రముఖ గురువులు వేదవల్లి వద్ద శిక్షణను పొందిన అనన్య సూరపనేని తన కూచిపూడి నృత్య ప్రదర్శనతో ఆద్యంతం ఆకట్టుకున్నది. సరస్వతి వందన, కళాసాపురము కాదా, కృష్ణ లీలలు, ధనశ్రీ తిల్లాన అంశాలను ప్రదర్శించి ఆకట్టుకున్నది. అనంతరం శంకరానంద కళాక్షేత్రం గురువులు పద్మశ్రీ ఆనంద శంకర్ శిష్య బృందం పుష్పాంజలి, దేవి కీర్తనం, దశావతారం, తిల్లాన అంశాలను భరతనాట్య నృత్యరూపకంలో ప్రదర్శించి అలరించారు.